# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 25-08-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని.లు

## ముఖ్యాంశాలు

❖ భారతీయ సమాజం స్వదేశీ ఉత్పత్తులను నమ్మకంతో స్వీకరించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు.

❖ భారత్ - ఫిజీ దేశాల మధ్య వివిధ రంగాలలో ఏడు పరస్పర అవగాహనా ఒప్పందాలు కుదిరాయి.

❖ విపక్షాలు 130వ రాజ్యాంగ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా చేపడుతున్న నిరసనలపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా అసంతృప్తి వ్యక్తం చేశారు.

❖ రానున్న 48 గంటల్లో బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండి) వెల్లడించింది.

==========================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రెండు రోజుల పర్యటనలో భాగంగా ఈరోజు సాయంత్రం గుజరాత్ చేరుకున్నారు. అహ్మదాబాద్‌లోని ఖోడల్ధామ్ మైదానంలో 5 వేల 400 కోట్ల రూపాయల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా జరిగిన బహిరంగ సభలో ఆయన ప్రసంగిస్తూ... దేశవ్యాప్తంగా మౌలిక వసతుల అభివృద్ధి శరవేగంగా కొనసాగుతోందన్నారు. ప్రస్తుత ప్రపంచం భారత ప్రతిభను గుర్తించి గౌరవిస్తోందని, ఫలితంగా వివిధ దేశాల్లో అనేక అవకాశాలు లభిస్తున్నాయని చెప్పారు. భారతీయ సమాజం స్వయం సమృద్ధి సాధించాలని, స్వదేశీ ఉత్పత్తులను నమ్మకంతో స్వీకరించాలని పిలుపునిచ్చారు. స్వదేశీ ఉద్యమం శతాబ్దాల నాటి స్మారకం కాదని.. ఇది భవిష్యత్‌ను బలోపేతం చేస్తుందని ప్రధానమంత్రి పేర్కొంటూ....

(వాయిస్ 26 సెకన్లు)

==========================

భారత్ లో పర్యటిస్తున్న ఫిజీ ప్రధానమంత్రి సితివేని రబుకా ఈరోజు న్యూఢిల్లీలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీతో సమావేశమయ్యారు. ఇరువురు ప్రతినిధి బృందం స్థాయి చర్చలు జరిపి ఆరోగ్యం, సామర్థ్య నిర్మాణం వంటి పలు రంగాల్లో 7 ఒప్పందాలను కుదుర్చుకున్నారు. అనంతరం జరిగిన ఉమ్మడి పాత్రికేయుల సమావేశంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మాట్లాడుతూ... ఫిజి రాజధాని సువాలో 100 పడకల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని నిర్మిస్తామని చెప్పారు. జన్ ఔషధి కేంద్రాల ఏర్పాటుతో పాటు.. డయాలసిస్ యూనిట్లు, సముద్ర అంబులెన్స్ లను ఆ దేశానికి పంపుతామన్నారు. సైబర్ భద్రత, డేటా రక్షణ రంగాలలో పరస్పరం సహకరించుకోవడానికి ఇరు దేశాలు సిద్ధంగా ఉన్నాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

==========================

విపక్షాలు 130వ రాజ్యాంగ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా చేపడుతున్న నిరసనలపై కేంద్ర హోం మంత్రి అమిత్ షా అసంతృప్తి వ్యక్తం చేశారు. ఒక వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈరోజు ఆయన మాట్లాడుతూ... బిల్లుకు వ్యతిరేకంగా ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న నిరసనను అప్రజాస్వామికమని అభివర్ణించారు. ఈ బిల్లు పరిధిలోకి ప్రధానమంత్రి కార్యాలయాన్ని కూడా తీసుకురావాలని నరేంద్ర మోదీయే పట్టుబట్టారని అమిత్ షా స్పష్టం చేశారు. జైల్లో ఉన్న నాయకులు ప్రభుత్వాన్ని ఎలా ఏర్పాటు చేస్తారని ఆయన ఈ సందర్భంగా ప్రశ్నించారు.

(వాయిస్ 32 సెకన్లు)

==========================

జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 29 నుండి 31వ తేదీ వరకు దేశవ్యాప్తంగా “ఫిట్ ఇండియా పాన్-ఇండియా” పేరిట ఫిట్‌నెస్ ఉద్యమాన్ని ప్రభుత్వం నిర్వహించనుంది. కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల శాఖా మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవీయ ఈ ఫిట్‌నెస్ ఉద్యమంలో పాల్గొని దేశ నలు మూలల్లో జరిగే క్రీడా కార్యకలాపాలకు నాయకత్వం వహించనున్నారు. ''ఏక్ ఘంటా, ఖేల్ కే మైదాన్ మై'' అనే ఇతివృత్తంతో మూడు రోజుల పాటూ దేశవ్యాప్తంగా జరిగే ఈ ఉద్యమంలో ప్రముఖ అథ్లెట్లు, ప్రజా ప్రతినిధులు కూడా పాల్గొననున్నారు.

విరామం

==========================

రాజధాని న్యూఢిల్లీలో నిన్న ప్రారంభమైన అఖిల భారత స్పీకర్స్ కాన్ఫరెన్స్ ముగిసింది. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల శాసనసభ స్పీకర్లు, డిప్యూటీ స్పీకర్లు, శాసనసభ కార్యదర్శులు ఈ సదస్సులో పాల్గొన్నారు. మొట్ట మొదటిసారిగా ఎన్నికైన భారతీయ స్పీకర్ విఠల్ భాయ్ పటేల్ స్మారకోత్సవంగా నిర్వహించిన ఈ కాన్ఫరెన్స్ లో పలువురు కేంద్ర మంత్రులు కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ రాష్ట్రాల శాసనసభ స్పీకర్లు శాసనసభా కార్యకలాపాలపై, పార్లమెంటరీ వ్యవహారాలపై చర్చలు జరిపారు. ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ కే.రఘురామ కృష్ణం రాజు, శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్ రాజు ఈ సమావేశంలో పాల్గొని ఇతర రాష్ట్రాల స్పీకర్లతో సమావేశమయ్యారు.

==========================

భారత యువజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ 2024 సంవత్సరానికి గానూ జాతీయ యువజన పురస్కారాలకు నామినేషన్లను ఆహ్వానిస్తోంది. 15 నుండి 29 సంవత్సరాల మధ్య వయస్సు గల యువత సామాజిక సేవా రంగంలో ఉత్తమ సేవలను అందించడతో పాటూ సమాజం పట్ల బాధ్యతాయుతంగా ఉండే స్ఫూర్తిని ప్రోత్సహించడమే ఈ అవార్డ్ ప్రధాన లక్ష్యం. ఈ అవార్డులను సాధారణంగా రెండు విభాగాలలో అందిస్తారు. వ్యక్తిగత విభాగం, సంస్థాగత విభాగం. ఈ

పురస్కారాల కోసం నామినేషన్లను awards.gov.in పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో సమర్పించాలి. దరఖాస్తులు సమర్పించడానికి చివరి తేదీని సెప్టెంబర్ 30 వరకు పొడిగించారు.

==========================

మణిపూర్ గవర్నర్ అజయ్ కుమార్ భల్లా ఈరోజు నాగాలాండ్ 22వ అదనపు గవర్నర్‌గా ప్రమాణ స్వీకారం చేశారు. గౌహతి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆశుతోష్ కుమార్ కోహిమాలోని రాజ్ భవన్‌లో ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈనెల 15న గవర్నర్ లా గణేషన్ మరణించడంతో అజయ్ కుమార్ భల్లాకు నాగాలాండ్ అదనపు బాధ్యతలు అప్పగించారు.

==========================

ఉత్తరప్రదేశ్‌లోని బులంద్‌షహర్‌లో జాతీయ రహదారి 34పై నిన్న అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మహిళలు సహా 9 మంది మరణించగా.. 45 మంది గాయపడ్డారు. కాస్‌గంజ్ జిల్లా నుండి రాజస్థాన్‌కు సుమారు 60 మంది ప్రయాణిస్తున్న ట్రాక్టర్ ను ఘటల్ గ్రామ సమీపంలో ఒక కంటైనర్ ఢీ కొనడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. గోగాజీ భక్తులు ఉత్తరప్రదేశ్‌లోని కాస్‌గంజ్ నుండి రాజస్థాన్‌లోని గోగామెడికి వెళుతుండగా ఈ ప్రమాదం జరిగిందని బులంద్‌షహర్ ఎస్.ఎస్.పి. దినేష్ కుమార్ సింగ్ తెలిపారు.

==========================

గుజరాత్‌లోని అహ్మదాబాద్ నగరంలో 30వ కామన్వెల్త్ వెయిట్‌లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్ ఈరోజు ప్రారంభమయ్యింది. తొలి రోజు భారత్ 2 స్వర్ణ పతకాలను గెలుచుకుంది. మహిళల విభాగంలో ప్రీతిస్మితా భోయ్, పురుషుల విభాగంలో ధరమ్‌జ్యోతి దేవ్‌ఘూరియా ఈ స్వర్ణ పతకాలను సాధించారు. అదే విధంగా టోక్యో ఒలింపిక్స్ రజత పతక విజేత మీరాబాయి చాను కూడా కొద్ది సేపటి క్రితం బంగారు పతకం గెలుచుకుంది.

==========================

రానున్న 48 గంటల్లో బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండి) వెల్లడించింది. దీని కారణంగా ఒడిశా, ఆంధ్రప్రదేశ్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లోని కొన్ని ప్రాంతాల్లో బుధవారం వరకూ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండి తెలిపింది. అదే విధంగా రేపు గుజరాత్, రాజస్థాన్ రాష్ట్రాల్లో భారీ నుండి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. ఇక మరోవైపు  గత నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా రాజస్థాన్‌లోని అనేక జిల్లాల్లో జనజీవనం తీవ్రంగా ప్రభావితమైంది. అదే విధంగా హిమాచల్ ప్రదేశ్‌లో నిరంతరాయంగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా సాధారణ జనజీవనం స్తంభించింది. గత 24 గంటల్లో బిలాస్‌పూర్ జిల్లాలోని కహులో అత్యధికంగా 190 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని, భారీ వర్షాల కారణంగా ఆ రాష్ట్ర వ్యాప్తంగా నదులు, వాగులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయని ఐఎండి వెల్లడించింది.

==========================

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు లాభాల్లో ముగిసాయి. ఉదయం సెన్సెక్స్ 81 వేల 306 పాయింట్ల వద్ద ప్రారంభమై... చివరకు 329 పాయింట్ల లాభంతో 81 వేల 635 వద్ద స్థిరపడింది.

==========================
==========================